క్లుప్తంగా

ఘనంగా గురునాథుని పూజోత్సవం



వేడుకలో పాల్గొన్న మురపాక వంశీయులు

ఎచ్చెర్ల: లావేరు మండలం లక్ష్మీపురం గ్రామంలో మురపాక వంశీయులు గురువారం గురునాథుని పూజోత్సవరం ఘనంగా నిర్వహించారు. 200 సంవత్సరాలుగా గురునాథుడిని కొలుచుకుంటూ వస్తున్నారు. అదే సాంప్రదాయం గున్నయ్యగారి కుటుంబంలో కొనసాగుతోంది.

బొలెరో బోల్తా



రోడ్డుపై పడిన సామగ్రి

ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేట జాతీయ రహదారిపై బ్యాటరీల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. బ్యాటరీలు, ఇన్వర్టర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని క్రేన్ సహాయంతో పక్కకు తీసి సహాయక చర్యలు చేపట్టారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని డి.ఆర్.వలస సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కుమరాపు శ్రీనివాసరావు తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం గ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు కుమరాసు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు, కుమరాపు రామ్మూర్తినాయుడు, బాలి అప్పలసూరి, పేడాడ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఉషా నిధుల వినియోగంపై చర్చ



భగవత్ గుప్తాను కలిసిన వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి పీఎం ఉషా (ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) నిధులు మంజూరైన నేపథ్యంలో వినియోగంపై వీసీ కె.ఆర్.రజిని గురువారం మంగళగిరిలోని ఉన్నతాధికారులతో చర్చించారు. కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ డైరెక్టర్, పీఎం ఉషా స్పెషల్ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ భగవత్ గుప్తాను కలిసి నిధుల వినియోగ విధానంపై మాట్లాడారు. నిబంధనల మేరకు మౌలిక వసతులు, అకడమిక్ బ్లాక్‌ల నిర్మాణానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు . నిధుల ప్రతిపాదనలకు చేసిన అంశాలను వివరించారు.

పకడ్బందీగా అకౌంట్ల నిర్వహణ



మండల అకౌంటెంట్లకు శిక్షణ ఇస్తున్న మోహనరావు

ఎచ్చెర్ల క్యాంపస్: మండల మహిళా సమాఖ్య ఖాతాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని వెలుగు సంస్థాగత నిర్మాణం జిల్లా మేనేజర్ మోహన్‌రావు అన్నారు. జిల్లాలోని మండల సమాఖ్యల అకౌంటెంట్లకు రెండు రోజులు శిక్షణ గురువారం ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం యూనిట్‌గా అన్ని గ్రామాల్లోనూ సంఘాల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఒత్తిడి లేకుండా పనిచేయాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల బలోపేతం లక్ష్యంగా పనిచేయాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, అధునాతన సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో అదరహో..!



ఇటీవల క్రీడల్లో రాణించిన విద్యార్థులతో హెచ్‌ఎం చంద్రశేఖర్, సాంబమూర్తి, దిలీప్ తదితరులు

- క్రీడల్లో దూసుకెళ్తున్న టీపీఎంహెచ్ స్కూల్ విద్యార్థులు
- జాతీయ, రాష్ట్ర స్కూల్‌గేమ్స్, గ్రిగ్స్ పోటీల్లో రాణింపు
- చదువులో సైతం అత్యుత్తమ ఫలితాలు



శ్రీకాకుళం పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న టీపీఎంహెచ్‌స్కూల్ ఇదే



డీఈఓ నుంచి పతకం అందుకుంటున్న పీఈటీ ఎల్.ఢిల్లేశ్వరరావు

స్టేట్‌మీట్ ఫుట్‌బాల్‌లో రజత పతకాలు సాధించిన విద్యార్థులు



జి.సూరజ్‌కుమార్ (9వ తరగతి)	ఎ.హేమసుందర్ (9వ తరగతి)	ఎస్.హరీష్ (6వ తరగతి)

గత మూడేళ్ల టెన్త్ ఫలితాలు ఇలా..

విద్యా సంవత్సరం	పరీక్షకు హాజరు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2021–22	110	110	100 శాతం
2022–23	106	75	71 శాతం
2023–24	106	93	88 శాతం

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోని టంగుటూరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్ (టీపీఎంహెచ్‌ఎస్) విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ అదరగొడుతున్నారు. అటు చదువు, ఇటు క్రీడలు రెండింటా విజయఢంకా మోగిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఇక్కడి విద్యార్థులు ప్రతిరోజు క్రీడలు, వ్యాయామంలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయుడు మెండ చంద్రశేఖరరావు ప్రోత్సహిస్తుండటంతో వీరు రెట్టించిన ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని మెరుస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు మెంటాడ సాంబమూర్తి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సమగ్రశిక్ష పీఈటీ, సీనియర్ నేషనల్ ప్లేయర్, నేషనల్ హ్యాండ్‌బాల్ రిఫరీ లోపింటి ఢిల్లేశ్వరరావు (దిలీప్) చేదోడుగా ఉంటూ క్రీడాకారులకు మెలకువలు నేర్పుతున్నారు. ఫలితంగా ఇక్కడి విద్యార్థులు పతకాల పంట పండిస్తున్నారు. నృత్యప్రదర్శనలు, చిత్రలేఖనం వంటి పోటీల్లో సైతం రాణిస్తున్నారు.

ఇటీవల మెరిసిన క్రీడాకారులు..

- జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు టి.దుర్గాప్రసాద్ ఎంపికయ్యాడు
- రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో సీహెచ్ రోహిత్, టి.దుర్గాప్రసాద్‌లు వినుకొండలో జరిగిన ప్రాతినిధ్యం వహించారు.
- హిందూపూర్‌లో అక్టోబర్ 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్రపోటీల్లో జి.సూరజ్, ఏ.హేమంత్, హరీష్‌లు రజత పతకాలు సాధించి సత్తాచాటారు.
- మార్టేరులో అక్టోబర్ 7 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీల్లో రాహుల్‌కుమార్, ఆర్.బాలాజీలు ప్రాతినిధ్యం వహించారు.
- విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఎం.కుమారస్వామి పాల్గొని పతకాలు సాధించారు.
- ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల గ్రిగ్స్ పోటీల్లో గ్రిగ్స్ పోటీల్లో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచి టైటిళ్లు అందుకున్నారు.
- అంతర్ పాఠశాలల గ్రిగ్స్ మీట్ నియోజకవర్గస్థాయి పోటీల్లో జావెలిన్‌త్రోలో బి.అప్పన్న, హైజంప్‌లో పి.కార్తీకరావు కాంస్య పతకాలు సాధించారు.
- పాఠశాలకు చెందిన పీఈటీ ఎల్.ఢిల్లేశ్వరరావు ఈనెల 8 నుంచి 10 వరకు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పీడీ, పీఈటీల సెమినార్ కమ్ స్పోర్ట్స్ మీట్‌లో హ్యాండ్‌బాల్ గేమ్‌లో శ్రీకాకుళం బృందం విజేతగా నిలవడంలో కీలకభూమిక పోషించారు.

అద్భుతాలు సృష్టిస్తున్నారు..



ఇక్కడ పాఠశాలలో క్రీడలు, నృత్యప్రదర్శనలు, చిత్రలేఖనం, ఇలా అన్నింటా ప్రతిభ కనబర్చే పిల్లలు ఉన్నారు. వారిని డీఈఓ సారథ్యంలో హెచ్‌ఎం చొరవతో బాగా తీర్చిదిద్దగలుగుతున్నాం.

– మెంటాడ సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు, పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిరంతరం ప్రోత్సాహం



నేను పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. హెచ్‌ఎంతోపాటు టీచర్లు, పీడీ సాంబమూర్తి, పీఈటీ దిలీప్ నిరంతరం ప్రోత్సహిస్తారు. స్టేట్‌మీట్స్‌తోపాటు జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.

– టి.దుర్గాప్రసాద్, నేషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్

విద్యార్థుల అభిరుచి మేరకు..



ఇక్కడ 6వ తరగతిలో చేరిన తర్వాత పిల్లల చదువుతోపాటు వారి అభిరుచుల మేరకు సృజనాత్మకతను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహిస్తున్నాం. క్రీడల పట్ల నిబద్ధత కలిగిన పీడీ, పీఈటీల చొరవ, కృషి ప్రసంశనీయం.

– మెండ చంద్రశేఖరరరావు, హెచ్‌ఎం, టీపీఎంహెచ్ స్కూల్ శ్రీకాకుళం

జగనన్న హయాంలోనే మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న పార్టీ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్

జి.సిగడాం: జగనన్న ప్రభుత్వ హయాంలోనే మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించి, ఆపదలో ఉన్న ప్రతి ఆడపడుచుకు అండగా ఉండేలా దిశ చట్టం అమలు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు చిత్తిరి మోహన్ అన్నారు. గురువారం ఆనందపురంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. జనసేన నేత కిరణ్ రాయల్ మహిళలను మోసం చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి సర్కారు కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం అన్నారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నేతృత్వంలో ప్రజల పక్షాల పోరాటం చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సమావేశంలో దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, పేడాడ కృష్ణంరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



ధ్రువపత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: సమాజంలో ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో తోటివారిని రక్షించాలన్నారు. సకాలంలో అంబులెన్సుకు ఫోన్ చేసి సమీప ఆస్పత్రికి తరలించాలని సూచించారు. రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌వో చేతుల మీదుగా ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పి.శ్రీకాంత్, ఎం.కల్యాణ్ చక్రవర్తి, చిన్మయరావు, వైకుంఠరావు, ఏవో నర్సింగరావు, గుణాకరరావు, ఇతర రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

తండేల్ సందడి



వేదికపై హీరో హీరోయిన్లు, దర్శక నిర్మాతలు

శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో గురువారం జరిగిన తండేల్ సినిమా సక్సెస్ మీట్ ఆద్యంతం అలరించింది. సినిమా హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి, దర్శకుడు చందు మొండేటి, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీవాసులు హాజరు కాగా.. వీరిని చూసేందుకు జనం భారీ ఎత్తున తరలివచ్చారు.

– శ్రీకాకుళం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం



హాజరైన అభిమానులు

డిపో మేనేజర్లకు ముగిసిన శిక్షణ



శిక్షణ పాల్గొన్న డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల్లోని నాన్ టెక్నికల్ డిపో మేనేజర్లకు శ్రీకాకుళంలో గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. శ్రీకాకుళం డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్సు మరమ్మతులు చేశాక కండీషన్ చెక్ చేసే విధానం, బస్ నిర్వహణలో వివిధ విభాగాలలో పరిశీలించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకటి, రెండు డిపోల మేనేజర్లు అమరసింహుడు, శర్మ, టెక్కలి, పలాస డిపో మేనేజర్లు ఎన్.శ్రీనివాసరావు, ఆర్ ఎస్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కార్తికేయ ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరానికి చెందిన లోలుగు కార్తికేయ జేఈఈ మెయిన్స్ సెషన్–1 పరీక్షల్లో 99.945 టాప్ పర్సంటైల్‌తో సత్తాచాటాడు. ఫిజిక్స్‌లో 99.382, కెమిస్ట్రీలో 99.968, మాథ్స్‌లో 99.938 స్కోర్ సాధించడం విశేషం. ప్రాథమిక విద్యాభ్యాసం శ్రీకాకుళంలోనే పూర్తి చేసిన కార్తికేయ ఇంటర్మీడియెట్ విశాఖపట్నంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. తండ్రి లోలుగు సత్యం కోటపాలెం జెడ్పీహెచ్ స్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, తల్లి మాధురి కేజీబీవీ పోలాకిలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. స్వస్థలం పొందూరు మండలం లోలుగు.

23న ప్రజాస్వామ్య పరిరక్షణ సమావేశాలు



సమావేశాల నిర్వహణపై చర్చిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఫిబ్రవరి 23న జరగనున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పట్టణంలోని ఐక్యవేదిక కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయడానికి ఐదు కమిటీలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కమిటీ బాధ్యులు చేయాల్సిన అంశాలపై సమీక్షించారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల ఆవరణంలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ముందుగా 22న కార్యవర్గ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కుమిలి రాజేష్, ఉంగటి వెంకటరమణ, ఉపాధ్యక్షులు శ్రీహరి, కార్యవర్గ సభ్యులు నక్క లక్ష్మణరావు, ధర్మారావు, కోంద్రు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన అదుర్స్



పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌లోని వైఎన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మహేశ్వరి, నాగ ఉదయ్, అరవింద్, పావని మెరుగైన ప్రదర్శన చేశారు. వీరిని రిజిస్ట్రార్ సుజాత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వనజ గురువారం అభినందించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సాయీ శరణం..బాబా శరణం



బొందిలీపురంలోని దర్బార్ షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

ప్రతిభకు ప్రశంసలు



శ్రీకాకుళం నగరానికి చెందిన రాజశ్యామల డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు కర్ణాటకలో జరుగుతున్న డ్యాన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచారు. గురువు లీలా కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించి బహుమతులు అందుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

అస్తవ్యస్తంగా మరుగుదొడ్ల నిర్వహణ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అకడమిక్ బ్లాక్‌లలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, కామర్స్ కళాశాల బ్లాక్‌ల మరుగుదొడ్లలో నీరు నిలిచిపోతుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చందనాల తిరుపతిరావు, గుంటుపిల్లి ఉమలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రణస్థలం మండల కేంద్రంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మరో 40 కుటుంబాలు కూడా పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జి.సిగడాం మండల ప్రత్యేకాహ్వానితులు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, నాయకులు బాలబొమ్మ శ్రీనివాసరావు, బాలి అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో భవానీ అ‘ద్వితీయం’



భవానీని అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమామహేశ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి గరికిపాటి భవానీ సరి‘కొత్త’ చరిత్ర లిఖించింది. తాను ప్రాతినిధ్యం వహించిన మొదటి స్టేట్‌మీట్‌లోనే రజత పతకం సాధించి శభాష్ అనిపించింది. విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో 8వ ఏపీ సీనియర్స్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 51–54 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించిన భవానీ ద్వితీయ స్థానంలో నిలిచింది. నాలుగు మాసాల క్రితం బాక్సింగ్‌లో ఓనమాలు నేర్చుకుని జిల్లాస్థాయి ఎంపికల్లో రాణించి రాష్ట్రపోటీలకు ఎంపిక కావడం విశేషం. తాజాగా విశాఖలో జరిగిన స్టేట్‌మీట్‌లో మొట్టమొదటిసారిగా ప్రాతినిధ్యం వహించడంతోపాటు రజత పతకం సాధించి ప్రసంశలు అందుకుంటోంది. కోటబొమ్మాళి సమీపంలోని చవితిపేటకు చెందిన కూలీలు గరికిపాటి అప్పన్న, సరోజినిల కుమార్తె భవాని.

హాస్పిటల్‌లో ట్రైనింగ్, బాక్సింగ్‌లో శిక్షణ..

బీఏ డిగ్రీ పూర్తిచేసిన భవానీ జీఎన్ఎం నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ట్రైనింగ్ పొందుతూనే మరోవైపు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో జాతీయస్థాయి బాక్సింగ్ సీనియర్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు వద్ద బాక్సింగ్‌లో శిక్షణకు పొందుతోంది. పతకం సాధించిన భవానీని డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు గురువారం కేఆర్ స్టేడియం వద్ద అభినందించారు.